క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు తూడెం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భోగాపురం: ఈ నెల 10, 11, 12 తేదీలలో వినుకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు సీనియర్ విభాగంలో తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన యు.లోకేశ్వరి.. అదేవిధంగా ఈ నెల17, 18, 19 తేదీలలో శ్రీకాకుళంలో జరగనున్న పోటీలకు (జూనియర్ విభాగంలో) కె. ఇందు, సీహెచ్ సాత్విక్, లోకేశ్వరి, దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.అప్పన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ సత్యనారాయన, తదితరులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

రాజకీయ వేధింపులు ఆపాలి..



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల ఐదో తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ కార్పొరేషన్ కార్యదర్శి బొగ్గు భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కె. రామచంద్రరావు, శ్రామిక మహిళా కన్వీనర్ జి. కుమారి, రమా, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా 4జీ టెక్నాలజీ

● బీఎస్ఎన్ఎల్ డీజీఎం దాలినాయుడు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం దాలినాయుడు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ దశలవారీగా ఫోర్‌జీ టెక్నాలజీని విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాలో ప్రవేశపెడుతోందని బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వినియోగదారులు 2జీ, 3జీ సిమ్‌కార్డును తక్షణమే 4జీ సిమ్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. 4జీకి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జీ , 3జీ సేవలు కూడా కొనసాగుతాయన్నారు. 4జీ సేవలను ఆస్వాదించడానికి దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్/ ఫ్రాంఛైజీ/రీటెయిలర్స్/ ఏజెంట్లను సంప్రదించాలని కోరారు.

అక్రమ రవాణా నియంత్రణకు వాహనాల తనిఖీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి, మద్యం, సారా, పశువుల అక్రమ రవాణాను నియంత్రించడంలో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు కొన్ని గుర్తించిన ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో వాహన తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్సై స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాలని, వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ చేసిన వాహనాల వివరాలను నమోదుచేయాలని స్పష్టం చేశారు. అలవాటుగా వాహన తనిఖీలు చేపట్టే ప్రాంతాలకు, సమయాలకు స్వస్తి పలకాలని చెప్పారు. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై దృష్టిపెట్టాలని, ఆయా వాహనాలను అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. డైనమిక్ వాహన తనిఖీలకు సంబంధించి ప్రణాళిక రూపొందించి, షెడ్యూల్ విడుదల చేశారు. వాహన తనిఖీలను సంబంధిత డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలంటూ ఆదేశాలు జారీచేశారు.

హోంగార్డును కఠినంగా శిక్షించండి

బొండపల్లి: యువతిపై అత్యాచారానికి పాల్పడిన హోంగార్డు ఎం.సురేష్‌ను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితురాలిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు పురం అప్పారావు డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉండే విజయగనరం జిల్లాలో ఇటీవల మహిళలపై లైంగిక దాడులు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్షించాల్సిన పోలీసులే ఇటువంటి చర్యలకు పాల్పడితే ఇక మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

● వాడవాడలా తల్లిపాల వారోత్సవాలు



నెల్లిమర్ల రూరల్ : గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న మిమ్స్ నర్సింగ్ కళాశాల సిబ్బంది



పూసపాటిరేగ : పేరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం

పూసపాటిరేగ : తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని.. తల్లులందరూ తప్పనిసరిగా బిడ్డలకు పాలు అందించాలని సర్పంచ్ రైతు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని పేరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లి పాలలో సహజ సిద్ధమైన వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ రాదని, అలాగే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అలాగే తల్లీబిడ్డల మధ్య అనుబంధం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బొంతు రవికుమార్, కొలచిన రమేష్ (చోటు) , కార్యకర్తలు శకుంతల, చిన్నమ్మలు, తదితరులు పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తి పెంపు..

నెల్లిమర్ల రూరల్: తల్లిపాలు తాగడం వల్ల బిడ్డల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షమ్‌షీర్ బేగం అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నేపథ్యంలో గొర్లిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలల వయస్సు నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. తల్లుల పాలివ్వడం వల్ల రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు దూరంగా ఉంటరని చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిమ్స్ సిబ్బంది దేవీలత, ప్రశాంతి పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా..



వేలంపాట నిర్వహణకు హాజరైన కమిషనర్, ఇతర అధికారులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ అధీనంలో ఉన్న ఖాళీ దుకాణాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో పాటదారులు అసమగ్రమైన వివరాలతో హాజరైనందున వేలంపాటను వాయిదా వేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యానాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు అనుకుని ఉన్న 22 దుకాణాలకు, అలాగే పాత, కొత్త ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. అయితే పాటదారులు నిబంధనలను అనుసరించి వేలంపాట ప్రక్రియలో పాల్గొనందున వాయిదా పడింది. ఈ సందర్భంగా కమిమీషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ప్రతి షాపునకు ఇద్దరు, అంతకన్నా ఎక్కువ మంది పాటదారులు పాల్గొంటేనే వేలంపాట నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అయితే పాటదారులు నిబంధనలు పాటించకపోవడంతో పాట వాయిదా వేయాల్సి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి కమిషనర్ ఎం. మల్లయ్యానాయుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులోభాగంగా శుక్రవారం సాయంత్రం వరకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే రావడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. వాస్తవానికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా... అందులో 48 స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు ఉన్నారు. ఒకరు టీడీపీ నుంచి, మరొకరు స్వతంత్ర్య అభ్యర్థిగా కొనసాగుతున్నారు. అధిక మెజార్టీ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఇదిలా ఉండగా గతంలో ఉన్న ఐదుగురు సభ్యుల్లో ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్న శెట్టివీరవెంకట రాజేశ్వరరావు స్టాండింగ్ కమిటీలో కొనసాగనుండగా... కొత్తగా జీవీ రంగారావు, ఎస్. నారాయణ స్వామి, రేగాన రూపాదేవి, అల్లు చాణక్య నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణ ఎంతో అవసరం

● వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: నేటితరం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఎంతో అవసరమని వాసవీక్లబ్ వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్ అన్నారు. డిమ్స్ కంప్యూటర్స్ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన పేద విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 32 ఏళ్లుగా సంస్థ నిరాటంకంగా సేవలందిస్తోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో అధిక సంఖ్యలో విద్యార్థులు దేశ,విదేశాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. డిమ్స్ కంప్యూటర్స్ డైరెక్టర్ కేఎస్‌బీకే రాజు మాట్లాడుతూ.. జిల్లాలో ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన ఏకైక శిక్షణ సంస్థ తమదేనన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ భాగ్యలక్ష్మి, సురేష్, భవానీ, సంధ్య , వాసవీక్లబ్ ప్రతినిధులు చెన్నా బుచ్చి జనార్దనరావు, విజ్జపు విజయకుమార్, నారాయణరావు, సముద్రాల నాగరాజు, కుమార్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలి

● ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘం



పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న ఈపీఎఫ్ ఉద్యోగ కార్మికులు

నెల్లిమర్ల: రిటైర్డ్ కార్మికులకు కనీస ఫించన్ రూ.9 వేలు ఇవ్వాలని ఈపీఎఫ్ ఫించన్‌దారుల సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవార స్థానిక పోస్టాఫీస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల కనీస పింఛన్ రూ. వెయ్యి నుంచి 9 వేల రూపాయలకు పెంచాలని పది సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా మోదీ సర్కార్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నియమించిన భగత్‌సింగ్ కొశియా కమిటీ, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలు ఈపీఎఫ్ పింఛన్ పెంచాలని సిఫార్సులు చేసినప్పటికీ మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. ప్రతిపక్షాలతో పాటు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో ఉన్న ఇతర రాజకీయ పక్షాలు మోదీపై ఒత్తిడి తీసుకువచ్చి కనీస ఫించన్ పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 6,7,8 తేదీల్లో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం, లెంక వెంకటప్పడు, జగ్గిన్ని సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి ఆకులపేట గ్రామానికి చెందిన ఆకుల స్వామి నాయుడు, జయలక్ష్మి దంపతులు రూ.51 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ట్రస్ట్ బోర్డు సభ్యులు కోరారు. కార్యక్రమంలో అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీను, గొల్లస్వామి, నాగులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

నెల్లిమర్ల: ఎన్డీయే కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బానిసకాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కూటమి నాయకులు అట్టాడ శ్రీధర్, అంబళ్ల అప్పలనాయుడు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, బంగారు భానుప్రకాష్, నల్లి చంద్రశేఖర్, రవ్వా నాని, పాంద్రంకి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

దళిత సత్తా కార్యవర్గ సభ్యుడిగా గౌరీశంకర్

గజపతినగరం: దళిత సత్తా మండల కార్యవర్గ సభ్యునిగా జిన్నాం గ్రామానికి చెందిన పి.గౌరీ శంకర్ ఎంపికైనట్లు జిల్లా దళిత సత్తా అధ్యక్షుడు కొత్తల గౌరినాయుడు శుక్రవారం తెలిపారు. మండల దళిత సత్తా కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన గౌరీశంకర్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

108 కలశాలతో అభిషేకం



108 కలశాలకు పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు సురేష్ శర్మ, భక్తులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం శత చండీ పూర్ణకుంభాభిషేకం, శత చండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో 40 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో యాగాన్ని పూర్తిచేశారు. అనంతరం శివాలయం గోపురానికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉమాసహిత కోటేశ్వరస్వామి ఆలయంలో శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్సీ రఘువర్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పామాయిల్ తోటలతో అధిక రాబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న

● ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న

పూసపాటిరేగ: పామాయిల్ తోటల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చునని భోగాపురం ఉద్యానవన అధికారి జ్యోత్స్న అన్నారు. మండలంలోని చౌడువాడలో పామాయిల్ రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పామాయిల్ సాగు చేస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహాలు అందుతాయని చెప్పారు. ఎకరం భూమిలో 57 పామాయిల్ మొక్కలు వేస్తే, ఒక్కో చెట్టు పదినుంచి 15 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుందన్నారు. పామాయిల్ తోటల్లో అంతర పంటలు కూడా సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు పార్థసారథి, సుధ, పతంజలి కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధి మొంగం నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి..

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పినతాడివాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, అక్కివరం సర్పంచ్ కంది కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వంటగదిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు సాయిరామ్, అనిల్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయిరామ్, అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల వసతిగృహాన్ని శుక్రవారం సందర్శించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌమారదశలో రుతుస్రావం వల్ల బాలికలు రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వంటగది, డైనింగ్ రూమ్, విశ్రాంతి గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

మెరకముడిదాం: రోడ్లపై ప్రయాణించే సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని బుధరాయవలస ఎస్సై బి.లోకేశ్వరరావు సూచించారు. గర్భాం జంక్షన్‌లోని ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని, వాహన రికార్డులు వాహనాల్లో ఉంచుకోవాలని, పోలీసులు అడిగినపుడు చూపించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగాల్లో స్థానికుల సంఖ్యపై సర్వే

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పరిశ్రమలు, వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో స్థానికుల సంఖ్యపై వారం రోజుల్లో సర్వే నిర్వహించి, నివేదికను సమర్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంతవరకు అమలు జరుగుతుందో నిర్ధారించిన నివేదికను దేశ అత్యున్నత న్యాయ స్థానానికి అందజేయాల్సి ఉన్నందున వారంలో రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లోని ఉద్యోగాల్లో స్థానికతపై వివిధ శాఖల అధికారులతో తన చాంబర్‌లో కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న 196 కర్మాగారాల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌ను, వివిధ పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని జిల్లా పరిశ్రమల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ఇండస్ట్రీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోవిందరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్, డీసీఎల్ సుబ్రమణ్యం, పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వర్రావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఇతర అధారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రికార్డులకు పటిష్ట భద్రత కల్పించాలి

జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. మూడు రోజుల్లో తగు సూచనలతో నివేదిక అందజేయాలని అగ్నిమాపక దళ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై జిల్లా రిజిస్ట్రార్, ఫైర్ ఆఫీసర్లతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద వాచ్‌మన్‌లను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారి, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్‌ఈ లక్ష్మణరావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సూచనలు మేరకు స్థానిక కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రేమలత మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, కానీ ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ డబ్బు, అధికారం, హోదా వంటివాటికి ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యోగా, వ్యాయామాన్ని దైనందిత జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో సుమారు 150 మందికి వైద్యులు సేవలందించారు. బీపీ, సుగర్, తదితర పరీక్షలతో పాటు మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com